



# అమ్మవారిని దర్శించుకున్న నాయుడు



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని వేములదివి కాపులకొడప గ్రామంలో వేంచేసినయున్న శ్రీ శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారిని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు మంగళవారం దర్శించుకున్నారు. 47 వ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయుడు వెంట తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు, నంద్యాల బాబు, మల్లాడి మూర్తి, ఫౌండేషన్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


17వ
సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం, 17 అక్టోబర్ 2023



# ఈవీఎంల మొదటి దశ పరిశీలన ప్రారంభం





## - సాంకేతికతపై రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడవచ్చు

**భీమవరం, మేజర్ న్యూస్:** భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను సోమవారం నుండి జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం ఈ.వి.యమ్ గోడౌన్‌లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సంయుక్తంగా పరిశీలించారు. సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిపోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన ఈవిఎంలను నేటి నుండి సుమారు 40 రోజులపాటు రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ప్రతీ యంత్రంలోనూ ఓట్లు వేసి ఏదైనా సాంకేతిక లోపం ఉన్న వాటిని పక్కన పెట్టి, మిగిలిన వాటిని ఆమోదించే ప్రక్రియ అని వివరించారు. బెంగుళూరు నుంచి వచ్చిన బెల్ ఇంజనీర్ల నిర్వహణలో వెబ్ క్యాస్టింగ్, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య పక్రియ జరుగుతుందన్నారు. ప్రతీరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీలు ప్రతినిధులు హాజరై ఈవిఎంల సాంకేతికతపై అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

కేంద్రంలోకి సెల్ఫోన్లు అనుమతించబోమని, గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బంది మాత్రమే పనిచేస్తారని, సీసీ కెమెరాల్లో నిరంతం పర్యవేక్షణ ఉంటుదని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎంల ఎఫ్ ఎల్ సి సూపర్వైజర్, డిఆర్ఓ కె.కృష్ణవేణి, ఎఫ్ఎస్సి ఇంచార్జ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎల్. నరసింహారావు, ఆర్డీవో దాసి రాజు, ఈవీఎంల నోడల్ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈవీఎం మున్సిపల్ కమిషనర్ఎం.శ్యామలడిప్యూటీతాహసిల్దార్ ఎం.సన్యాసి రావు, తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఈవీఎంల మొదటి విడత పరిశీలన





## జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

**ఏలూరు, మేజర్‌న్యూస్ :**జిల్లాకు కేటాయించబడిన ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని అత్యంత అప్రమత్తంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు .సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కాంపౌండ్ లో ఉన్న ఈవీఎం గోడౌన్లో ఈవీఎంలు,వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం ప్రారంభమైమంది. ఈ కార్యక్రమన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు .ఈ సందర్భంగా అందరి సమక్షంలో ఆయా ఈవీఎం స్టోర్ రూమ్ లను తెరిచి ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచినవంబర్ 10వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌నుపై నిర్దేశించిన అక్టోబర్ 16 నుంచి నవంబర్ 10 వ తేదీ వరకు రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ యం.వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్,డిఆర్‌డిఎ పిడి డా.అర్ విజయరాజు,ఏలూరు డి ఎస్ పి శ్రీనివాసులు ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# నరసాపురంలో సైకిల్ తొక్కిన దేశం నేతలు




**నర్సాపురం,మేజర్‌న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సైకిల్ పై పట్టణంలో తిరుగుతూ నినాదాలు చేశారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్గర నుండి ఆ పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, యువ నాయకుడు కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయం సెంటర్,మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్ల మీదగా లలితాంబ గుడి దగ్గర చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జైలు నుండి త్వరగా బయటికి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కొప్పాడరవీంద్రనాథ్ ఠాగూర్, వాటాడి ఉమామహేశ్వరరావు, గుబ్బల నాగరాజు, మల్లాడి మూర్తి, జోగి పండు, బర్రె మురళి,శంకుభాస్కర్‌నాయుడు, ముత్యం, నిమ్మకాయల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# టీ. నర్సాపురం సొసైటీ మాజీ సీఈవోపై కేసు నమోదు

## రూ.16 కోట్ల 80 లక్షల దుర్వినియోగంపై ఆరోపణలు

**టి.నర్సాపురం,మేజర్ న్యూస్:** నూజివీడు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ మాదల మోహన్ బాబు అనే వారికి రాబడిన విచారణ నివేదిక మేరకు టీ నర్సాపురం మండలం కె.జగ్గవరం గ్రామానికి చెందిన తడికలపూడి కిషోర్ కుమార్ పై ఎస్ ఐ సురేంద్ర కుమార్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టీ నర్సాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ ఆయన తన కుటుంబ సభ్యుల పేరు మీద, తన సహా ఉద్యోగుల, కుటుంబ సభ్యుల పేరు మీద, బయట వ్యక్తుల పేరు మీద రుణాలు ఇవ్వకుండా ఇచ్చినట్లు విచారణ నివేదిక ద్వారా వెల్లడయింది. అంతేకాకుండా చనిపోయిన వ్యక్తికి కూడా రుణం ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించి,తన సొంతానికి ఉపయోగించుకున్నారని 16కోట్ల,80 లక్షల,17 వేల 76 రూపాయలను దుర్వినియోగపరచినట్లు నూజివీడు సహకార అధికారి ఇచ్చిన ఫిర్యాదు పై టీ నర్సాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాల్య వివాహా రహిత రాష్ట్రం కోసం కృషి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :**రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సిపురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలోని న్యాయమూర్తులు, న్యాయ వాదులు, పారా లీగల్ వాలంటీర్స్, సంబంధిత స్టేక్ హెూల్డర్స్ సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనకు కార్యక్రమాలు చేపట్టారు. బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ రూపొందించడం కొరకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగిందని తెలియజేశారు.

# జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

## ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :**పట్టణంలోని 9,13,14,15, వార్డులకు సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ ను వలవల వారివీధిసచివాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్‌డాక్టర్ కేవెంకటేశ్వరరావు అధ్యక్షతవహించారు. ఈ కార్యక్రమమునకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కొరకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కు విశేష స్పందన వస్తుందని అన్నారు. సోమవారంఇక్కడ జరిగే మెడికల్ క్యాంపు కు సుమారు 1500 మంది వైద్య పరీక్షలుకు వచ్చారన్నారు. వైద్య పరీక్షలు చేయుట కొరకు స్పెషలిస్టులైనపిల్లలు డాక్టర్ ,జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తులు, కంటి వైద్యులు, చెవి ముక్కు గొంతు, నిపుణులు రావడం జరిగిందన్నారు. వచ్చిన వారందరికీ ఈరోజు సాయంత్రం వరకు వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధించిన మందులు ఉచితంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇక్కడ నయం కానీ రోగము లకు ఆరోగ్యశ్రీలో వైద్య సదుపాయం కొరకు రీఫర్ చేస్తారని ఆయన చెప్పారు. పేదరికం వైద్యమునకు ఆటంకం కాకూడదు అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్య సంతోషంగా ఉండాలి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో కొన్ని లక్షల నిరుపేదల కుటుంబాలను వైద్య పరంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యక్రమం పెట్టి 300 రోగాలకు ఉచితంగా వైద్యం సేవలను అందించగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆరోగ్యశ్రీ మరింత మెరుగుపరిచి 3,200 రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చిఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్య సేవలు అందిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ ,బర్రె శంకర్ కావలి నాని సిరం దుర్గరాజు, మోకా అశ్విని తేజ రాజు, గోరు సత్తిబాబు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, శిరిగినీడి వెంకన్న నిడుమోలు ఉమా ఖాన్ భాష,బల్ల తాతాజీ, తోట తాతాజీ, మల్లాడి బుజ్జి, డాక్టర్లు, వైద్య సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, వాలంటరీలు, పాల్గొన్నారు.

# మెడిసిన్ పిజి ఎంట్రన్స్‌లో సిరి చందనకు 376వ ర్యాంక్



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** మండలం గొల్లవాని చెరువు గ్రామానికి చెందిన కుమారి డాక్టర్ సిరి చందన (ఎం బి బిఎస్. డిఎన్‌బి, జనరల్ మెడిసిన్) కు ఆల్ ఇండియా నీట్ సూపర్ స్పెషలైజేషన్ ఫలితాల్లో 376 ర్యాంకు సాధించింది. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం పాలకొల్లు లోనీ మాంటిసోరి స్కూల్లో జరిగింది ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య స్కూల్లో చదివిన సిరి చందన శ్రీకాకుళంలోని జేమ్స్ మెడికల్ కళాశా లలో ఎంబిబిఎస్ పూర్తి చేసి హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో డి ఎన్ బి జనరల్ మెడిసిన్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం హైదరాబాదులోని కొంపల్లిలో ఉన్న మెడ్ ప్లస్ ఆసుపత్రిలో వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. ఇటీవల జరిగిననీట్ సూపర్ స్పెషలైజేషన్ పరీక్షలు రాసిన సిరి చందన ఆదివారం విడుదలైన ఫలితాలలో ఆల్ ఇండియా 376 ర్యాంకు సాధించింది. ఈమెకు ప్రాథమిక విద్య నుంచి మెరిట్ మీదే వైద్య విద్యను అభ్యసించడం గర్వించదగ్గ విషయం. సూపర్‌స్పెషలైజేషన్లోభాగంగా గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో వైద్య కోర్సు పూర్తి చేసి పేదలకు వైద్యం అందించాలని ధ్యేయంగా పెట్టుకున్నట్లు డాక్టర్ సిరి చందన తెలిపారు. కాగా సిరి చందన కుటుంబ పద్యం తండ్రి ముత్యాల శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్టుగా పాలకొల్లు ఆంధ్రజ్యోతి పత్రికలో పనిచేస్తు న్నారు. తల్లి సీతామహాలక్ష్మి గృహిణిగా, సోదరుడు శ్రీ వాత్సవ ప్రదీప్ ఇంజనీరింగ్ పూర్తి చేసి బిజినెస్ చేస్తున్నారు.

ర్యాంకు సాధించిన డాక్టర్ సిరి చందన ను పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీటీడీ సభ్యులు మేకా శేషుబాబు, డీసీ ఎంఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల తాతాజీ, రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, పాలకొల్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎం ఎన్ బి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, మాంటిసోరిస్ కరస్పాండెంట్ మద్దాల వాసు, మద్దాల రాంప్రసాధ్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు

# పేదవారికి వైద్యం భారం కాకూడదు



## - ప్రభుత్వ విప్ ముదునూరి

**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్:**పేదవారికి వైద్యం భారం కాకూడదు అనారోగ్యాలకు గుర్రై కుటుంబాలు ఆర్థికంగా నలిగి పోకూడదని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. మండలంలోని రుస్తుంబాద గ్రామపంచాయతీ వద్ద సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయనసందర్శించారు. శిబిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన స్టాల్స్ ను పరిశీలించారు. గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు రక్తహీనత అధిగమించడానికి ఏర్పాటు చేసిన తినుబండారాలను పరిశీలించి రాగి జావను స్వయంగా ఆయన రుచి చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ బందెల భారతి అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ వైద్య పరంగా ఒక్క కుటుంబానికి కూడా ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఆయన అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు ద్వారా వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు చేయించి నెలకు సరిపడా ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. నెలలో మూడుసార్లు 104 ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికి వచ్చి ఆరోగ్య టెస్టులు చేసి షుగరు బిపి తదితర వ్యాధులకు ప్రతినెల మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు .అనారోగ్యంతో లేవలేని పరిస్థితిలో ఉన్నవారికి ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేయుటకు ఫ్యామిలీ డాక్టర్లు సదుపాయం తేవటం జరిగిందన్నారు.

ముందుగా రుస్తుం బాద పంచాయతీ మండా వారి గరువులో రూ:7 లక్షలు జడ్పీ (జి.ఎఫ్) నిధులతో నిర్మించిన అంగనవాడి భవనమును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జడ్పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపీడీవో యన్. శివప్రసాద్ యాదవ్ ,మైలా బత్తుల శ్రీను, చినమిల్లి చంద్రశేఖర్ , జాన్ కెనడి, యడ్లపల్లి హర్ష, డి.హినెల్లి, దీన మనసు, మీసరపు కుటుంబరావు, మీసరపు శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాశి అన్నపూర్ణగా వాసవి మాత

## ఉమా చంద్ర శేఖర స్వామి వారికి సహస్రాధిక జ్యోతిర్లింగార్చన



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో ఈరోజు వాసవి మాత ఆలయంలో శ్రీకాశీ అన్నపూర్ణగా విశేష అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అలంకారంలో శ్రీ సంధ్యా లక్ష్మిగా దర్శనమిచ్చారు. ముందుగా శ్రీ చెక్కా రమణమూర్తి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారం స్వామి దంపతులు, కొత్త బుల్లి స్వామి మరియు శ్రీనివాసరావు దంపతులు మద్దుల బాలాజీ దంపతులు, సన్నిధి రామ్ కుమార్ దంపతులు మొదలైన 14 మంది దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఉదయం ఏడు గంటలకు చెక్క వెంకట రమా రమణమూర్తి, రాధా దంపతులు వేద గోషల మధ్య ఆర్యవైశ్య సంఘ సభ్యులతో ఆలయ ప్రదక్షణ, ఉమా చంద్రశేఖర్ స్వామి వారికి మహాన్యాస నిత్యాను ష్టానములు మొదలైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి శివాలయంలో స్వామివారికి శత సహస్ర బిల్వపత్ర పూజ, మూల మంత్రములతో రుద్ర, చండీ కమల, అనురాధ, జ్యేష్ఠ, మూల నక్షత్రాలకు హెూమాలు నిర్వహించారు. సాయంత్రం ఏడున్నర గంటలకు సహస్రాధిక జ్యోతిర్లింగార్చన దర్శనము, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవా కార్యక్రమాలతో మాన్యశ్రీ శ్రీరామం గారి పర్యవేక్షణలో 20 మంది వేద పురోహితుల మధ్య పూజా క్రతువు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు ఉత్సవ కమిటీ అధ్యక్షులు వబిలి శెట్టి నటరాజు, తాడేపల్లిగూడెం శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవల్లి చెన్నా నాగేంద్రరావు, కార్యదర్శి మండా బ్రహ్మాజీ, నున్న సుందర్రావు, ఆలయ కార్యదర్శులు శ్యామ్ చిన్న మరియు వివిధ కమిటీల సభ్యులు సహకారంతో భక్తులకు అన్ని విధాలా తీర్థప్రసాదాలు అందించబడ్డాయి

# హిందీ మాధ్యమిక పరీక్షలో సుశాంత్‌కు రాష్ట్రస్థాయి ర్యాంకు



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** దక్షిణ భారత హిందీ ప్రసార సభ మాధ్యమిక పరీక్షలో పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి గడ్డం సుశాంత్ కుమార్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు సెప్టెంబర్ 9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిబిహెచ్‌పిఎస్ పరీక్షలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నుండి 494 మంది విద్యార్థులు ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష,ప్రవేశిక పరీక్షలు హాజరయ్యారని ప్రిన్సిపల్ రాజారావు తెలిపారు వారిలో 484 మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించారన్నారు సోమవారం విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో తమ పాఠశాల నుండి గెడ్డం సుశాంత్ మాధ్యమిక పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని తెలిపారు ప్రాథమికలో 163 మంది, మాధ్యమికలో 282 మంది, రాష్ట్ర భాషలో 07 గురు, ప్రవేశికలో 32 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రథమ ర్యాంకు సాధించిన సుశాంత్ ను వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్,హిందీ ఉపాధ్యాయులు ఎం.వి బాలాజీ, బి శ్రీనివాసరావు, ఎన్ సంజీవరావు, డి సి ఓ, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

# గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



**కైకలూరు మేజర్ న్యూస్:** 2వ రోజు శ్రీ గాయిత్రీ దేవిగా దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు. మండవల్లి రైల్వే స్టేషన్ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామాలయం నందు దసరా శరన్నవరాత్రులను మహిళా మణులందరూ కలిసి అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవిగా, రెండవ రోజు శ్రీ గాయత్రీ దేవిగా మండవల్లి మహాలక్ష్మి అమ్మవారు దర్శనం ఇచ్చారు. మొదటిరోజు గ్రామస్తులు కట్ట నాగరాజు సరోజినీ దంపతులు, రెండవ రోజు గుబిలి ప్రసాద్ ,గౌరీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుపుతామని 21వ తేదీన గ్రామ శ్రేయస్సు కొరకు మహిళలందరూ కలిసి కలశాల ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. నేడు శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తారని తెలియజేశారు.

# 17న మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని ద్వారకాతిరుమల రాక



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సి. రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు విజయవాడలో బయలుదేరి ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల చేరుకుంటారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనం చేసుకుంటారు, తదుపరి ఉ.11.00 గంటలకు మీడియా ప్రతినిధులతో సమావేశం అవుతారు. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకాతిరుమల నుండి బయలుదేరి సింహాచలం వెళతారు.

# స్పందన సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## ప్రజాసేవ చేయడం అదృష్టంగా భావించాలి

**–జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**



**భీమవరం,మేజర్‌న్యూస్:** ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ధరఖాస్తులను జిల్లా కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు, సంబంధిత అధికారులతో కలసి స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి అధికారులు పని చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందనలో వివిధ రకాల సమస్యలతో ప్రజలు అందజేసిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, అర్జీదారులను సంతృప్తి పరచాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. స్పందనలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడవలోపుగా పరిష్కరించాలని, సమస్య పరిష్కరించడానికి అవకాశం లేకపోతే అందుకు గల కారణాలను దరఖాస్తుదారునికి ఎందువల్ల పరిష్కారం చేయలేక పోతున్నామో విషయాన్ని అర్జీదారునికి చెప్పాలన్నారు. వచ్చిన అర్జీలు మళ్ళీ రాకుండా చూడాలన్నారు. స్పందనలో అర్జీని తీసుకున్న దగ్గర్నుంచి డిస్పోయేదాకా ఏమేమి చర్యలు తీసుకున్నారో క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు.జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మథూర్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లిఖార్జున రావు, డిఎల్డివో కెసిహెచ్ అప్పారావు, డియస్పి బి. శ్రీనాథ్‌లు ఆర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు.స్పందన కార్యక్రమం ద్వారా 252 ధరఖాస్తులు స్వీకరించడం జరిగిందిలి వాటిలో కొన్ని ధరఖాస్తులు ఇలా ఉన్నాయి .తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధి కుంచనపల్లి నివాసి.తలారి నరసమ్మ.నా భర్త మరణించారు. వైఎస్ఆర్ భీమా పథకం మంజూరు అయింది. కాని సొమ్ము ఇంతవరకు బ్యాంకులో జమ కాలేదు. డబ్బులు జమ అయ్యేలా చూడగలరు.ఇరగవరం మండలం రేలంగి కొత్త కాలని 6 వార్డు నివాసి. కలిగొట్ల అలివేలు మంగతాయారు. మాది నిరుపేద కుటుంబం. కేవలం ప్రభుత్వ పెన్షన్, రేషన్ బియ్యం తోనే జీవనం సాగిస్తున్నాము. రేషన్ బియ్యం తూకంలో దగా జరుగుచున్నది. విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.భీమవరం పురపాలక సంఘ పరిధి 20 వార్డు నాయీవారి వీధి నివాసి. భీమవరపు ఆదిలక్ష్మి. నేను ఒక ప్రైవేటు హాస్పిటల్లో గర్భసంచి ఆపరేషన్ అప్పుచేసి చేయించు కున్నాను. ఇప్పుడు కట్టలేని పరిస్థితిలో ఉన్నాను ఆరోగ్యశ్రీ ద్వారా నాకు ఆ సొమ్ములు ఇప్పించాలని కోరారు.ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామ నివాసి కుక్కల లక్ష్మి .ప్రభుత్వంకు చెందిన పోరంభోకు స్థలంలో అక్రమంగా ప్రహారీ గోడ నిర్మించారు. దీనివల్ల బండ్లు గాని ట్రాక్టరు గాని మెయిన్ రోడ్డు వెళ్లలేకపోతున్నాయి. విచారణ చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. కాళ్ళ మండలం కోపల్లే గ్రామ నివాసి బాలం సత్యనారాయణ. గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పిల్టరు లేకుండా అద్వానంగా వస్తున్నాయి. దీనివల్ల వైరల్ జ్వరాలతో బాధపడు చున్నాము. ఫిల్టరు చేసి రక్షిత మంచినీటిని సరఫరాను చెయ్యాలని కోరా రు.పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామ నివాసి.నాగగాన వెంకటేశ్వర రావు.మొదటి భార్య చనిపోతే రెండవ వివాహం చేసుకున్నాను. ఇప్పుడు వృద్ధాప్య దశలో ఉన్నాను. నా భార్య భోజనం పెట్టడం లేదు, ఇంటిలోకి అడుగు పెట్టనీయడం లేదు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరా రు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గా ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షి దేవి 66వ శరన్నవరాత్రి మహోత్సవాలు



పెనుమంట్ర, మేజర్ న్యూస్: మార్టేరు కంచి కామాక్షి దేవి అమ్మ వారి 66వ శరన్నవరాత్రి మహోత్సవ ములు ఆదివారం మొదలై ఈనెల 23వ తేదీ సోమవారం వరకు పూజా కార్యక్రమాలు జరుగునని పంచ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం తెలిపారు, కామాక్షి దేవి అవతారాల్లో భాగంగా సోమవారం బాల త్రిపుర సుందరి, మంగళవారం అన్న పూర్ణాదేవి, బుధవారం గాయత్రీ దేవి, గురువారం మహాలక్ష్మి దేవి, శుక్రవారం సరస్వతి దేవి, శనివారం లలితా దేవి, ఆదివారం దుర్గాదేవి (గాజులతో అలం కరణ), ఆఖరి రోజు సోమ వారం ఉదయం మైసా సుర మర్ధని సాయంత్రం రాజరా జేశ్వరి అవతారాలు అలంకరిం చబడునని కమిటీ తెలిపింది. ఈ దేవి నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నిత్య పూజలు చేయించుకునేవారు, చందాలు ఇచ్చేవారు, ఆలయ అర్చకులు కొండవీటి వంశీకృష్ణ (8555879295), కమిటీని సంప్రదించగలరని తెలిపారు

కామాక్షిదేవి గుడికి దాతలు ఇచ్చిన సహకారం మరువలేనిదని ఇంకా ఎవరైనా దాతలు సహకరిస్తే కమిటీని సంప్రదించగలరని కోరారు, అవతారంలో భాగంగా సోమవారం అమ్మవారిని బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు, పెద్ద ఎత్తునభక్తులు తెల్ల వారుజాము నుండి దర్శించుకున్నారు.

# బాల్య వివాహాలు అరికట్టాలి




**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** గ్రామంలోని ఎస్సీ కాలనీలో బాల్య వివాహం నిరోధక చట్టం 2006 గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ బాల్యవివాహం వంటి సాంఘిక దురాచారమును రూపుమాపడానికి ఉద్దేశించిన చట్టం అని 18 సంవత్సరాల నిండిన ఆడపిల్లలను 21 సంవత్సరాలు నిండిన బాలుడికి కనీసం వివాహ వయసు గా నిర్ణయించడం జరిగింది. అలా కాకుండా ఇద్దరు మైనర్లకు వివాహం చేసిన జరిపిన లేదా వివాహానికి అనుమతి ఇచ్చిన లేదా దానిని నిర్లక్ష్యం వహించిన రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయలు జరుమాన విధించబడుతుందని అవగాహన కల్పించారు.అయితే కాకుండా 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు వివాహం జరిగితే ఆడపిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవటంతో పాటు అనారోగ్యంతో సంతానం పుట్టే అవకాశం ఎక్కువగా ఉందని ఆరోగ్యకరమైన పిల్లలు రేపటి మన దేశ భవిష్యత్తు అనే ద్వారకాతిరుమల మహిళా పోలీస్ పి లక్ష్మి సుజన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన సదస్సులో ఐసిడిఎస్ సూపర్వైజర్ మేరీ విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిర్మూలనపై అవగాహన



**ముసునూరు మేజర్ న్యూస్:** ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవోజిరాణిఆధ్వర్యంలోబాల్యవివాహాలు నిర్మూలనపై స్వయం సహాయక సంఘం సభ్యులతో సోమవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సం వత్సరాలు దాటిన తర్వాతే వివాహం చేయాలనే నిబంధనలు పెట్టిందన్నారు. కొంతమంది తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదన్నారు. రహస్యంగా బాల్య వివాహాలు చేసినవారిపై ప్రభుత్వంకఠినచర్యలు తీసుకొంటుంద న్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘం సభ్యులతో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎంపీడీవో రాణి ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు జరిగినట్లు మీ దృష్టికి వస్తే112,1098ఫోన్‌నెంబర్లను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలోఈవోపీఆర్డి సత్యనారాయణ, సి.సి లు, స్వయం సహాయక సంఘం సభ్యులు , మహిళలు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్‌కు రూ.25వేల విరాళం



**పాలకొల్లు, న్యూస్:** భీమవంలో జరిగిన వాకర్స్ ఇంటర్ నేషనల్ కేబినెట్ మీట్‌లో గెస్ట్‌గా పాల్గొని ప్లాటినం డో నర్ అయ్యి 25 వేలు రూనా పాయలు డిస్ట్రిక్ట్ గవర్నర్ గవర్నర్ శనగన కృష్ణ మూర్తి కి అందజేసిన కర్రా జయ సరిత. ఇంతక ముందు గోల్డ్ డోనార్ గా రూ.50 వేలు రూపాయలు అందజేయడం జరిగింది. వైజాగ్‌లో ఉన్న వాకర్స్ ఇంటర్ నేషనల్ ట్రస్ట్ బోర్డ్‌కి మొత్తం రూ. 75 వేలు రూపాయలు అంద జేసి నట్లు న్యాయ వాది వైఎస్ఆర్సీపీ మహిళా నాయకురాలు కర్రా జయ సరిత తెలిపారు.

## ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులు విజ్ఞాన, విహార యాత్ర



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** దసరా సెలవులు సందర్భంగా ఉల్లంపర్రు మంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో బెంగళూరు మైసూర్, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు ఐదు రోజులపాటు విజ్ఞాన విహారయాత్ర ను విద్యార్థులు కు ఏర్పాటు చేయడం జరిగింది.పాలకొల్లు నుండి అక్టోబర్ 15 న బయల్దేరి తిరిగి మరల అక్టోబర్ న20వ తారీఖున పాలకొల్లు చేరుకుంటాము,దీనిలో 55 మంది విద్యార్థులు 10 మంది టీచర్లు మొత్తం 64 మందినివెళ్తున్నాము అని మాంటిస్సోరిస్ స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు తెలియజేశారు.ఇప్పటి వరకు విమాన ప్రయాణం చేయని వారికి స్కూల్ ద్వారా ఈ అవకాశము వచ్చింది అని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. దీనిలో ప్రిన్సిపాల్ సామవేదం వసంత లక్ష్మి,రావాడ సతీష్ మరియు ఉపాద్యాయులు, విద్యార్థులు యాత్రలో పాల్గొనడం జరిగింది.

# 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం




**పాలకొల్లు, మేజర్ న్యూస్:** స్థానిక లజపతిరాయ్ పేట రెండో వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 10. క్వింటాళ్లు స్వాధీన పరచుకుని పొన్నాడ కోటేశ్వర రావు అనువారి పై 6 ఏ కేసు నమో దు చేసినట్లు సివిల్ సప్లై డ్యూటీఐతం సత్యనారాయణ తెలిపారు.ఈ దాడిలో వీఆర్వోలు సుబ్బారావు విప్పర్తి రమేష్ పాల్గొన్నారు.


## పుస్తక పఠనం విజ్ఞానదాయకం, వినోదభరితం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** దసరా సెలవులు సందర్భంగా బాలల గ్రంథాలయం ఏలూరు నందు నిర్వహించబడుతున్న చదవటం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులతో పుస్తక పఠనం, అనంతరం పంచతంత్ర కథలు చెప్పుట, నీతి కథలు పుస్తక సమీక్ష నిర్వహించడం జరిగింది. విద్యార్థులు తాము చదివిన కథలో నీతిని వివరించారు. మంచి అలవాట్లు మంచి భవిష్యత్తుకు పునాది అని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లినట్లుగా గ్రంథాలయానికి కూడా రావడం అలవాటు చేసుకోవాలని ఎం సాంబశివరావు రిటైర్డ్ లెక్చరర్ తెలిపారు, వై ఎన్ చైతన్య చే పొడుపు కథలు, విద్యార్థులతో ఆటలాడించారు.విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎం. శోభ, ఎం కీర్తి పాల్గొన్నారు.

## బాల్యవాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



**పెదవేగి,మేజర్‌న్యూస్:**బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలు జరిపించడం వల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు ప్రకారం వివాహాలు జరిపించడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని ఆమె అన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల తల్లి బిడ్డకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు బాల్యవివాహాలను నిర్మూలించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు.

బాల్యవాహల నిరోధానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు అనంతరం బాలివాహాలవల్ల బాలికలకు ఎదురయ్య సమస్యలను వివరిస్తూ ఐసిడిఎస్, వైద్యశాఖ, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ ఆర్ మనోజ్, ఈఓ పి ఆర్ డి శ్రీనివాస్,ఎంఈఓ సిహెచ్ బుధ వాస్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు లేని భారత్ లక్ష్యంగా పనిచేయాలి



**పెనుమంట్ర, మేజర్ న్యూస్:** మండలంలోని నెగ్గిపూడి గ్రామంలో గల అంగన్వాడి కేంద్రం నుండి నెగ్గిపూడి – మార్తేరు ప్రధాన జంక్షన్ వరకు బాల్య వివాహాలు లేని భారత్‌పై అవగాహనా కలిగించే విధంగా ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ,నినాదాలు చేస్తూ,ర్యాలీనిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ యం.ధనలక్ష్మి మాట్లాడుతూ ఎక్కడా 18 సంలోపు బాలికలకు వివాహాలు జరగకుండా డ్వాక్రా సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు చూడాలని ఇందుకు అంగన్వాడి, మహిళా పోలీస్‌లతో సమన్వయము చేసుకుని కృషి చేయాలని కోరారు.వార్డు సభ్యులు గుత్తుల సాల్మన్ దొర మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, చదువు నష్టపోయే ఈ దురాచారాన్ని అరికట్టాలని,బాల్య వివాహం నిలుపు చేసిన వారిని సత్కరిస్తామని తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బాలికలలో రక్తహీనత ఎలా నివారించాలి అనే అంశంపై వివరించారు.అనంతరం బాలికలు,విద్యార్థులు,అందరితోబాల్యవివాహాలుఅరికడతామని గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు, ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలసాయిరెడ్డి ,మహిళా పోలీస్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు టీ.భవాని,కనకదుర్గ, ఆయాలు,ఏఎన్ఎం మాధవి, సంధ్య,ఎంపీహెచ్ రామకృష్ణ,వాలంటీర్లు, డ్వాక్రా వీఏవో లు,సభ్యులు పాల్గొన్నారు.

# సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు




**కుకునూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రా. తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకు అద్వాన్నంగా ఉన్న ప్రధాన రహదారి నిర్మాణపనులు వెంటనే చేపట్టాలని, మండలంలోని అంతర్గత రహదారులు మరమ్మతులు చేపట్టి, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు కుకునూరు ప్రధాన సెంటర్లో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి. నాగేందర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన నాటినుండి పోలవరం ప్రాజెక్టుముంపు పేరుతో మండలంలో ఎటువంటి అభివృద్ధి పనులు చెయ్యకుండా, అభివృద్ధిని పూర్తిగా నిలిపి కనీసం మౌలిక వసతులు కూడా కల్పించకుండా అటు పాలకులు. ఇటు ప్రభుత్వ అధికారులు ముంపు మండలాల ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు జంగారెడ్డిగూడెం..

భద్రాచలం మధ్యగల ప్రధాన రహదారిపై నిత్యం అనేక వాహనాలు తిరుగుతుంటాయి. ఆంధ్రా.. తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని వెంకటాపురం. నుండి లంకాలపల్లి వరకు గల ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులతో చెరువుల ను తలపించేలా ఉండి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోక పోవడం దుర్మార్గం అన్నారు. ముంపు మండలాలు కావడంతో ఏ ఒక్క అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు.. ప్రభుత్వం స్పందించి వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకు గల45కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టాలనికోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఈ దీక్షలలో సీపీఎం నాయకులు పట్ల. లక్ష్మయ్య, మహబూబ్ పాషా, ఎస్. లక్ష్మణ్ రావు, ఖాసీం, చంటి వరసా. రాజు, పొలయ్య, మంగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ జగనన్న సంకల్పం

**: ఎంపీపీ అనూష**



ఆగిరిపల్లి, మేజర్ న్యూస్: రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పం అని ఎంపీపీ గోళ్ల అనూష పేర్కొన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, విద్యా, వైద్యం, వంటి అని రంగాల్లో ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు.వైసీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటే ఆర్థికంగా బలోపేతం అవుతుందని, పేద వర్గాల వారు నాణ్యమైన వైద్యాన్ని పొందాలంటే ఆర్థికంగా ఎంతో శ్రమించాల్సి వస్తుందన్నారు. వెనుకబడిన వర్గాల వారిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి అందరికీ అందుబాటులో ఆరోగ్యాన్ని ఉంచేందుకు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. మండల జె సి ఎస్ కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని పేదవారి కోసమే ఉద్భవించిన పార్టీ అని, మన కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి వర్ణించలేనిదని,ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలన్నీ సద్వినియోగంచేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిన్ని బోయిన వీరబాబు, ఎంపీడీఓ పి శంకర్రావు, గ్రామ సర్పంచ్ వేము రాజు,గోళ్ళ ఇస్సాకు,అంగన్వాడి కార్యకర్తలు, వైద్యాధికారుల బృందం,పలువురు అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్స్ తదితరులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# 26వ వార్డులో పోస్ట్ కార్డు ఉద్యమం



**నరసాపురం, మేజర్ న్యూస్** :తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి (సేవ్ డెమోక్రసీ, సేవ్ ఆంధ్రప్రదేశ్) అంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమంస్థానిక 26 వ వార్డు వీవర్స్ కాలనీలోనిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొనిరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు పోస్ట్ కార్డులు తపాలా ద్వారా పంపి నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో పులపర్తి సతీష్, పులపర్తి శ్రీధర్ సందకర్ల సూరిబాబు, బట్ట అప్పల స్వామీ, చెల్ల బోయిన భాస్కరావు, చెన్నం శెట్టి రమేష్, కంబాల వీరబాబు, బొడ్డు.సుబ్రమణ్యం, సుంకర నాగబాబు మరియు మహిళలు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గా అమ్మవారు



**ఆగిరిపల్లి, మేజర్ న్యూస్:** దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రమైన ఆగిరిపల్లి మెట్ల కోనేరు సమీపంలో గల శ్రీ కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా రెండో రోజైన సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలం కారంతో భక్తులకు దర్శన మిచ్చారు.

దసరా నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని తెల్లవా రుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, ముఖ్య ంగా మహిళలు శ్రీ కనకదుర్గా అమ్మవారి దేవస్థానానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# స్పందన సమస్యల పరిష్కారంలో పలువురికి సంతృప్తి





## అర్జీదారులకు ల్యాప్ టాప్, టచ్ ఫోన్ అందజేసిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్

**ఏలూరు, మేజర్ న్యూస్:** స్పందన-జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో తెలుపుకున్న తమ సమస్యలు పరిష్కారం కావడం పట్ల పలువురు అర్జీదారులు సంతోషం వ్యక్తంచేస్తూ జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.సంతృప్తికరంగా తమ సమస్య పరిష్కారమైయిందని పలువురు లబ్దిదారులు తెలియజేస్తూ సంబంధిత పత్రాలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా అందుకున్నారు. ఇటువంటి సంతృప్తి కరంగా పరిష్కారమైన అర్జీల్లో కొన్నింటిని ఆయా మండలాల నుంచి తెలుసుకొనే నూతన ఒరవడికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శ్రీకారం చుట్టారు. ఇందులో బాగంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయా లబ్దిదారులు, ధరఖాస్తు చేసిన వాటికి సంబంధించి పత్రాలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వారికి అందజేశారు. ఇందుకు సంబంధించి సంతృప్తికర స్థాయిలో పరిష్కారమైన అర్జీలకు సంబందించి సోమవారం కైకలూరు మండలానికి చెందిన బదిరుడైన కెవన్ వి అనీల్ కుమార్‌కు టచ్ ఫోన్‌ను, జంగారెడ్డిగూడెం కు చెందిన మరో బదిరియైన గొంటిరెడ్డి జ్యోతికి ల్యాప్ టాప్ ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అందజేశారు. ఈ సందర్బంగా కెవన్ వి అనీల్ కుమార్, గొంటిరెడ్డి జ్యోతి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. చింతలపూడి మండలానికి చెందిన కుక్కపల్లి సీతారామయ్య తమభూమి మ్యూటేషన్ కోసం ధరఖాస్తు చేయగా చింతలపూడి తహశీల్దారు సంబంధిత పత్రాలనుసిద్ధం చేశారు. వాటిని సోమవారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా కుక్కపల్లి సీతారామయ్య అందుకున్నారు. నిడమర్రు మండలం బలే చినదుర్గ ఇంటిపట్టాపై పేరుమార్పుకోసం అర్జీ అందించగా సదరు పేరు మార్పు చేస్తూ నిడమర్రు తహశీల్దారు సిద్దం చేసిన పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా చినదుర్గ అందుకున్నారు.ఈ సందర్బంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర రావు మాట్లాడుతూ ఇంటర్ పూర్తిచేసిన బధిరులకు ఇతర వేరే బధిరిలతో మాట్లాడుకునేందుకు టచ్ ఫోన్‌ను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఇది విభిన్నప్రతిభా వంతుల అభివృద్ధికి దోహదప డుతుందన్నారు.ఈకార్యక్రమంలో జెడ్పి సిఇఓ కె.రవికుమార్,ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జివివి సత్యనారా యణ, సూర్య నారాయణరెడ్డి,జివస్ డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసరు రమణ,పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీకి పతకాల పంట



**పెదవేగి,మేజర్‌న్యూస్:** రాజమండ్రిలో జరిగిన మెడికల్ కాలేజీల అంతర్గత తేడా పోటీల్లో దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల విద్యార్థులుపతకాలపంటపండించారనికళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి. మోజెస్ తెలిపారు.డాక్టర్ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జివస్ఎల్ మెడికల్ కళాశాల నిర్వహించిన 23వ మహిళల అంతర్గత క్రీడలు ఘనంగా జరిగాయి.

ఆంధ్ర రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలు, దంత కళాశాలలు ఈ క్రీడలలో పాల్గొన్నాయి.ఈ క్రీడలలో సెయింట్ జోసెఫ్ దంత కళాశాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌లో మొదటి స్థానం,త్రో బాల్, బాస్కెట్ బాల్,బ్యాట్మెంటన్ యందు తృతీయ స్థానం సాధించారు.ఈ క్రీడాకారులను కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్,కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.స్లీవరాజు ,అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, ఫాదర్ ఎం ధర్మరాజు, ఫాదర్ జాకోబ్,కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్ నల్లయ్య ను, క్రీడాకారులను అభినందించారు.

# సొసైటీలు రైతులకు మెరుగైన సేవలు అందించాలి

– శాసనసభ్యులు ఆళ్లనాని



**ఏలూరు, మేజర్ న్యూస్:**స్థానిక శనివారపేట విశాల సహకార సంఘ చైర్ పర్సన్ గా శనివారపుపేటకు చెందిన కంది రంగబాబు సోమవారం ఉదయం పదవీ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపముఖ్యమంత్రి , శాసనసభ్యులు ఆళ్ల నాని పాల్గొన్నారు. ముందుగా ఆళ్ళనాని సమక్షంలో చైర్ పర్సన్‌గా రంగబాబు ప్రమాణ స్వీకారం చేశారు.ఈసందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ శనివారపేట సొసైటీ వంద సంవత్సరాలు చరిత్ర కలిగినదన్నారు. వందేళ్లుగా రైతుల అభివృద్ధికి కోటాను కోట్ల రూపాయలు ఋణాలుగా అందించిందని చెప్పారు. మరో ముఖ్య అతిదిగా విచ్చేసిన నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ చైర్ పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం అభినందనీయమన్నారు. తొలుత సొసైటీ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం సొసైటీ చైర్మన్ కంది రంగబాబు మాట్లాడుతూ సొసైటీతో పాటు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇంకా ఈకార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ చిరంజీవి, నగర డిప్యూటీ మేయర్లు గురుదేశి శ్రీనివాసరావు సుధీర్ బాబు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ స్పందనకు 45 అర్జీలు



**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయములో సోమవారం జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి స్పందన కార్యక్రమము నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదిదారులు వచ్చి పిర్యాదులను ఎక్కవగా వర కట్నం వేదింపులు, సరిహద్దుల విషయములో గొడవలు, సివిల్ వివాదలపై అర్జీలు ఇచ్చారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన సుమారు 45 ఫిర్యాదులన్నింటి పై సత్వరమే చట్ట ప్రకారం ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాటలాడి ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా నుండి స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఏలూరు శ్రీ సత్యసాయి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో భోజన సదుపాయాలను కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పండగ సెలవులలో ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించిన ఎడల వారి ఇంటికి ఎల్. హెచ్.ఎం.ఎస్ (లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం) ద్వారా రక్షణ ఏర్పాట్లను కలగచేసి ఇంటి దొంగతనాలు నివారణ కొరకు చర్యలు తీసుకుంటాము అని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి వివరించారు.

# నేడు సాయంత్రం తాగునీరు సరఫరా నిలుపుదల.. కమిషనర్

**నరసాపురం, మేజర్ న్యూస్:** పురపాలక సంఘ పరిధిలోని హెడ్ వాటర్ వర్క్సు నందుగల క్లారిఫ్లొక్యులేటర్ మెయింటినెన్సులో భాగంగా క్లారిట్లొక్యులేటర్ ను క్లీనింగు (శుభ్రం) చేయుటకు గాను పట్టణము నందు 17వ తేదీ సాయంత్రం అనగా మంగళవారం ఇచ్చే మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు.తిరిగి యధావిధిగా 18వ తేదీ ఉదయం నుండి మంచినీటి సరఫరా చేయబడుతుందని, మంగళవారం ఉదయం సరఫరా చేయు మంచినీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ కోరారు.

# గాయత్రి అలంకరణలో కుంకుళ్ళమ్మ అమ్మవారు



**ద్వారకాతిరుమల, మేజర్‌న్యూస్:** శరన్నవ రాత్రిల్లో భాగంగా రెండో రోజైన సోమవారం నాడు ద్వారకా తిరుమల గ్రామ శివారులో కొలువైన కుంకుళ్ళమ్మ అమ్మవారు గాయత్రి దేవిగా సాక్షాత్కరిస్తుంది. వేదమాతగా ప్రసిద్ధి పొందిన ఈ తల్లి ముక్తా,విద్రుమ,హేమ, నీల,ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ భక్తుల ను అనుగ్రహిస్తుంది.పంచ ముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందనం అధిష్టానం దేవత అయిన గాయత్రి దేవుని పూజిస్తే సకల ఉపద్రవాలు తొలగు తాయినీ బుద్ధి తేజోవంతం అవుతుందని భక్తులకు ఆలయ పూజారి పుసులూరు భైరవ స్వామి వివరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో మహిళా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# బాల్య వివాహాలు బెయిల్ రాని నేరం



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై సోమవారం ఏలూరు లోని మోతె వారి తోట సచివాలయంలో ఏలూరు పట్టణ సమైక్య సంఘ సభ్యులకు అవగాహన ప్రచారాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నవజీవన్ బాల భవన్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.తెలిసి తెలియని చిన్న వయసులో బాలికలు వివాహం చేసుకోవడం జీవితంలో ఎదుగుదలకు ఎన్నో రకాలుగా అవరోధం కలిగిస్తుందన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు 21 సంవత్సరాలలోపు అబ్బాయికి వివాహం చేస్తే పెళ్లి కుమారునికి, వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొన్న వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని ప్రియాంక వివరించారు . ఇది బెయిలు లభించని నేరమన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకొని సంసారం చేసిన భర్తకు ఫోక్సో చట్టం కింద 10 సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించవచ్చునన్నారు.నవజీవన్ బాల భవన్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత మాట్లాడుతూ బాల్యవివాహంగురించి సమాచారం తెలిసిన వారు ఎవ్వరైనా ఫిర్యాదు చేయవచ్చు అని, పోలీసులు, జిల్లా కలెక్టర్, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఇలా ఎవరికైనా ఫిర్యాదు చేయవచ్చు, రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు, నోటిమాటగా చెప్పవచ్చు. ఉత్తరం రాయవచ్చు ఈ మెయిల్ చేయవచ్చు అని, బాల్యవివాహం చేసిన వారెవరైనా నేరస్థులే అని, తల్లిదండ్రులు, సంరక్షుకులు, పురోహితులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు, బాల్య వివాహానికి అనుమతించిన కులపెద్దలు, వివాహ ఏర్పాట్లకుసహకరించిన వారందరూ నేరస్థులేఅని..పెళ్లికి హాజరైనవారుకూడా నేరస్థులవుతారు అని తెలియజేసారు.ఈ నేరస్థులకు రెండేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడవచ్చు, లక్షరూపాయల వరకు జరిమానా విధించవచ్చు అని వివరించారు.అనంతరం ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ ప్రశాంతి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు లో భాగంగా సంఘ సభ్యులతో ర్యాలీలు నిర్వ్యాహించి అనంతరం బాల్య వివాహాల నిషేధంపై సంఘంలోని సభ్యులందరూ " ఎలాంటి బాల్య వివాహం చేయబోనని, నా కుటుంబంలో, సమాజంలో ఎలాంటి బాల్య వివాహం లో పాల్గొనబోనని, ప్రోత్సహించనని మనస్ఫూర్తిగా ప్రమాణం చేస్తున్నాను" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ జి. రాజేశ్వరి రిసోర్స్ పర్సన్స్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# టిడిపి నేతలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర పిలుపుమేరకు సోమవారం నాడు ఏలూరు జిల్లా కేంద్రంలో సైకిల్ యాత్ర కార్యక్రమమునకు బయలుదేరుతున్న రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావును కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో అతని స్వగృహంలో గృహనిర్బంధించి పోలీసులు..బీసీ విభాగం తరపున నిర్వహించే సైకిల్ యాత్రకు రాజమండ్రి కార్యక్రమాలకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు 144 సి ఆర్ పి సి అమల్లో ఉన్నందున ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతి లేదని, కలిదిండి పోలీసు వారు చెప్పి సాయంత్రం వరకు ఇంటివద్ద గగృహనిర్బంధించారు. సందర్భంగా అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు గతంలో ఎప్పుడు ఎదుర్కోనంతటి దుర్భర పరిస్థితులు జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎదుర్కొని అనుభవిస్తున్నారు. లాగే స్వాతంత్ర పోరాటంలో సైతం ఎదుర్కొనంతటి నిర్బంధాలు ప్రజలు భరిస్తున్నారని, బ్రిటిషర్లను మించిన క్రూరత్వం జగన్మోహన్ రెడ్డి తన పోలీసులును వాడుకొని ప్రజలను ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని తెలిపారు. గతంలో రజకార్లు పాలే గాళ్లు ప్రజలు వేధించే వాళ్ళని, కానీ నేడు రాష్ట్రంలో అంతకు మించిన అరాచకం జగన్ రెడ్డి పాలనలో చూస్తున్నామని, మరియు ముఖ్యంగా నోరెత్తాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు కల్పిస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాంగం ద్వారా కల్పించినహక్కులను కాలరాస్తున్నారని తెలిపారు.

# ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమరాజు




**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జగనాధపురం సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించి అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ గ్రామాలలో వ్యవసాయ కూలీలకు పనులు లేక ఉపాదా హామీ పనులు కోసం ఎదురు చూస్తున్నారని తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనైనా చూపండి తిండి అయినా పెట్టండి అంటూ పెద్ద ఎత్తున వామపక్ష పార్టీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి పార్లమెంటులో వామపక్ష పార్టీలు, ఎంపీల కృషితో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అందులో భాగంగానే ఉపాధి హామీకి నిధులు తగ్గించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పీల గాది నాయుడు గజ్జరపు వెంకటేశ్వరరావు కోనవరపు నాగభూషణం ఆమర్తి చంద్రరావు నల్లి శ్రీను పేర్ల వీర్రాజు గంప నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# 2024 సంవత్సరం స్వామివారి క్యాలెండర్ ఆవిష్కరణ



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయ 2024 సంవత్సరం క్యాలెండర్ ను సోమవారం ఉదయం దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొట్టు సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ క్రమంలో దేవాలయ ఈవో వేంద్ర త్రినాధరావు ప్రధానార్చకులు పెద్దింటి రాంబాబు, ఏ ఈ ఓ శ్రీనివాసు, రాజు సూపర్డెంట్ మద్దాల శ్రీను తదితరులు ఉన్నారు.

# కాపు వనిత క్లబ్ ఆర్థిక సాయం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:**అక్టోబర్ 15 తారీఖున మిస్సెయిల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత మాజీ రాష్ట్రపతి ఏ పి జె అబ్దుల్ కలాం" "పుట్టినరోజు" ను పురస్కరించుకొనిపాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ వారు ఆకస్మాతుగా బిల్డింగ్ పై నుంచి పడిపోయి తన రెండుకాళ్లు , కొన్ని శరీర భాగాలకు ఫేక్చర్ అయి మంచానికే పరిమతమైన ఎల్ అండ్ టి గృహ సముదాయం లో నివసిస్తున్న జనపరెడ్డి లక్ష్మణరావు క్లబ్ తరపున ఆర్థిక సాయంగా 8000/-లు నగదు ను అందించుట జరిగింది. ముందుగా యడ్లబజార్ లో పార్కు లో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలదండలు వేసినారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ మంగిన అరుణ, సెక్రటరీ యామన విజయలక్ష్మి, శిద్దిరెడ్డి శైలజా రాణి, గణేష్ణ రాధ,కర్రి రేవతి, రావి సృజన,కావలి మౌని, మండెల లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు

# ప్రముఖ నాట్యాచార్యులు కెవి సత్యనారాయణ దాతృత్వం



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు - సాయిబాబా ట్రస్ట్ తరపున ప్రముఖ నాట్యాచార్యులు కళారత్న కెవి సత్యనారాయణ ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు అవసరమైన బీరువా, వస్తుసామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ముందు ముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన వసతుల కల్పనవిషయాల్లో సహకరిస్తామని అన్నారు.కళాశాల ప్రిన్సిపల్ డా. గుత్తా గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కెవి సత్యనారాయణను అభినందించారు.కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు,ట్రస్ట్ ప్రతినిధి ఎన్ జయంత్ సాయి,వైస్ ప్రిన్సిపాల్ కెఅజయ్ కుమార్,వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకటరావు, డా. ఎం రాంబాబు డా. ఎం.విజయ్ కుమార్,ఎస్.పరమేశ,ఎమ్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.